నేడు ఇస్కాన్ ఆధ్వర్యంలో రథయాత్ర

సుభాష్‌నగర్, జూలై 7 : ఇస్కాన్ – నిజామాబాద్ ఆధ్వర్యంలో జగన్నాథ రథయాత్రను నేడు (సోమవారం) నిర్వహించనున్నట్లు ద్వారకానగర్‌లోని ఇస్కాన్ కేంద్ర నిర్వాహకులు బలరాం ప్రభు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకేంద్రంలోని పాతగంజ్‌లో రథయాత్ర మహోత్సవంలో భాగంగా మూడవరోజు సుభద్ర, బలరామ కృష్ణుల విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఒంటి గంటకు పాతగంజ్ క్లాక్‌టవర్ నుంచి రథయాత్ర ప్రారంభమై, గాంధీగంజ్, శివాజీనగర్, పూలాంగ్ చౌరస్తా, హనుమాన్ జంక్షన్ నుంచి తిరిగి పూలాంగ్ చౌరస్తా, హైదరాబాద్ రోడ్, జిల్లా కోర్టు రోడ్, తిలక్‌గార్డెన్, రాజస్థాన్ భవన్ మీదుగా సాయంత్రం 6 గంటలకు పాతగంజ్ క్లాక్‌టవర్‌కు చేరుకుంటుందని వివరించారు. విశేష పూజల అనంతరం తీర్థ ప్రసాద వితరణ ఉంటుందని, భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

సద్వినియోగం చేసుకోవాలి

కోటగిరి,జూలై 7: ఈనెల 10, 24, 31వ తేదీల్లో సదరం క్యాంపులు నిర్వహించనున్నారని ఎంపీడీవో మనోహర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా సర్కారు దవాఖానలో ఉదయం 10 గంటలకు క్యాంప్ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. మీసేవా కేంద్రాల్లో బుక్ చేసుకున్న స్లాట్ తేదీ ప్రకారం దివ్యాంగులు క్యాంపునకు హాజరుకావాలని తెలిపారు. సదరం క్యాంపునకు వెళ్లే దివ్యాంగులు మెడికల్ రిపోర్టులు వెంట తీసుకొని వెళ్లాలని సూచించారు.

క్షయ వ్యాధి నివారణ కోసం వివరాల సేకరణ

పొతంగల్, జూలై 7 : క్షయ వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా 18 ఏండ్లు పైబడినవారి వివరాలను సేకరించి వయోజనుల బీసీజీ టీకా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు హెచ్‌ఈవో గోవర్ధన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో ఆరోగ్య శాఖ సిబ్బంది వివరాలు సేకరించేందుకు వస్తారని, వారికి సహకరించాలని కోరారు.

లలితాదేవి ఆశ్రమంలో గోపూజ

గోపూజలో పాల్గొన్న మేఘరాజ్ శర్మ స్వామి, ఆశ్రమ నిర్వాహకులు

సుభాష్‌నగర్, జూలై 7 : నగరంలోని న్యాల్‌కల్‌రోడ్‌లో ఉన్న లలితాదేవి ఆశ్రమాలయంలో ఇందూరు గోసేవ ఆధ్వర్యంలో ఆదివారం గోపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ధార్మికవేత్త ఫణతుల మేఘరాజ్‌శర్మ స్వామీజీ హాజరై అనుగ్రహ భాషణం చేశారు. గోమాతకు పూజ చేస్తే సకల దేవతలకు పూజ చేసినట్లే అన్నారు. వేదపండితులు పశుపతి శర్మ, ఆగమయ్య గుప్తా, లలితాదేవి ఆశ్రమాలయ అర్చకుడు వేలేటి రాజేందర్ శర్మ, ఇందూరు గోసేవ ప్రతినిధులు రమేశ్, శ్రీనివాస్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

దండోర రజతోత్సవాలకు తరలిన నాయకులు

కోటగిరి/బోధన్ రూరల్/ఆర్మూర్‌టౌన్/వేల్పూర్/సిరికొండ/శక్కర్‌నగర్, జూలై 7 : హైదరాబాద్ రవీంద్రభారతిలో ఆదివారం నిర్వహించిన దండోర రజతోత్సవాల కార్యక్రమానికి కోటగిరి మండలం నుంచి ఎమ్మార్పీఎస్ నాయకులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ఉదయం 8 గంటలకు కోటగిరి మండల కేంద్రం నుంచి ప్రత్యేక బస్సులో వెళ్లారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు దేగా సాయిలు, బొర్ర సాయన్న, గోపు సాయిలు, కన్నం శ్రీనివాస్, రవి,లాలయ్య, నవీన్, కార్తీక్, సాయికృష్ణ, నాగేశ్, పండు, కన్నం శ్రీను, పోశెట్టి, అబ్బయ్య, నాగయ్య, ప్రవీణ్, లక్ష్మణ్, శివ తదితరులు పాల్గొన్నారు. సాలూరా మండల కేంద్రంలో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం ఎదుట ఎమ్మార్పీఎస్ రజతోత్సవ వేడుకలను నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు. ఆర్మూర్‌లో మాదిగ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ మాదిగ సంఘాల యూనైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొక్కెర భూమన్న తదితరులు పాల్గొన్నారు. వేల్పూర్ మండలంలోని పడిగెల్ గ్రామంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలను నిర్వహిస్తున్నారు. నాయకుడు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. ఎమ్మార్పీఎస్ రజతోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు బోధన్ నుంచి పలువురు నాయకులు హైదరాబాద్‌కు వెళ్లారు. రాష్ట్ర నాయకుడు మందుగుల విద్యాసాగర్, నాయకులు లింబూరి లక్ష్మణ్ ఉన్నారు. సిరికొండ మండలం పెద్ద వాల్గోట్ గ్రామంలో ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు సంజీవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లు అందజేత

సర్టిఫికెట్ అందుకుంటున్న రాజశేఖర్

ఏర్గట్ల, జూలై 7: టెక్ మహీంద్ర, సైన్స్ అకాడమీ హైదరాబాద్ సంయుక్తంగా నిర్వహించిన మాస్టర్ ట్రైనర్ ఇన్ సైన్స్ ఎడ్యుకేషన్ (2022-24) సర్టిఫికెట్ల పంపిణీ హైదరాబాద్‌లోని సాలర్‌జంగ్ మ్యూజియంలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీనియర్ సైంటిస్ట్ అహ్మద్ ఖలీల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కోర్సును పూర్తి చేసిన ఏర్గట్ల జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు గాండ్ల రాజశేఖర్, నగరంలోని దుబ్బ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు చల్లా ముద్దుకృష్ణకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లను ఆయన అందజేశారు. సైన్స్ బోధనలో కొత్త పద్ధతులు, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై శిక్షణ పొందినట్లు తెలిపారు. వీరికి రాష్ట్ర, జిల్లా స్థాయిలో టీచర్లకు శిక్షణ అందించే నైపుణ్యాలు ఉంటాయని ప్రాజెక్ట్ హెడ్ స్రవంతి తెలిపారు.

ఎస్జీటీ ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న బీసీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు వినోద్‌కుమార్

ఖలీల్‌వాడి, జూలై 7 : బదిలీ అయిన ఎస్జీటీ ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని బీసీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు మాడవేడి వినోద్‌కుమార్ అన్నారు. జిల్లాకేంద్రంలోని సంఘ కార్యాలయంలో ఆదివారం ఉపాధ్యాయులతో కలిసి మాట్లాడారు. ఒకేపాఠశాలలో 13 ఏండ్లపాటు పనిచేసి బదిలీ అయిన వారిని కూడా రిలీవ్ చేయకపోవడం బాధాకరమన్నారు. బదిలీ అయిన ఎస్జీటీ ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేసి, ఖాళీలను విద్యావలంటీర్‌తో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. దరఖాస్తు చేసుకునే సమయంలో ఆప్షన్లకు సరిపడా సమయం ఇవ్వక, సాంకేతిక, ఇతర కారణాలతో నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని, అర్హత కలిగిన ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని కోరారు. బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీసీ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి రాఘవాపురం గోపాలకృష్ణ, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, గౌరవ సలహాదారుడు రమణస్వామి, డిచ్‌పల్లి మండల అధ్యక్షుడు కొట్టాల రామకృష్ణ, మహిళా ఉపాధ్యక్షురాలు బోగ ప్రతిభ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జగన్నాథ రథయాత్ర

రథయాత్రలో పాల్గొన్న భక్తులు

ధర్పల్లి, జూలై 7 : ధర్పల్లి మండలకేంద్రంలోని మాలగుట్టపై నిర్మించిన జగన్నాథ ఆలయ వార్షికోత్సవం, రథయాత్ర ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. వీడీసీ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ధర్పల్లి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా జగన్నాథ రథయాత్ర నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి హాజరై పూజలు నిర్వహించారు. అనంతరం గుట్టపైన ఉన్న స్వామివారి ఆలయంలో శాస్త్రోక్తంగా పూజలు చేశారు. మండలకేంద్రంతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. మాజీ ఎంపీపీ నల్ల సారికా హన్మంత్‌రెడ్డి దంపతులు ఆలయంలో పూజలు చేశారు.

ఘనంగా ఆల్ఫోర్స్ కల్చరల్ ఫెస్ట్

డ్యాన్స్ చేస్తున్న కళాశాల విద్యార్థులు

ఖలీల్‌వాడి, జూలై 7 : జిల్లాకేంద్రంలోని శ్రావ్యగార్డెన్‌లో ఆల్ఫోర్స్ కళాశాల కల్చరల్ ఫెస్ట్ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆల్ఫోర్స్ కళాశాల విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. నేటి సమాజంలో యువత మానసికఒత్తిడికి గురవుతున్నదని అన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగిస్తాయన్న ఉద్దేశంతో ఈ కల్చరల్ ఫెస్ట్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇంటర్మీడియెట్ భవిష్యత్తుకు టర్నింగ్ పాయింట్ అని, క్రమశిక్షణతో ఉన్నత చదువులు చదివి, మంచి స్థానంలో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

లైబ్రరీకి పుస్తకాల వితరణ

జక్రాన్‌పల్లి, జూలై 7 : మండలంలోని పడకల్‌లో ఉన్న లైబ్రరీకి తెలంగాణ ఆదర్శ పాఠశాల – డిచ్‌పల్లి ఉపాధ్యాయుడు నర్సయ్య పుస్తకాలను ఆదివారం వితరణ చేశారు. పడకల్ గ్రామానికి చెందిన ఉపాధ్యాయులు అంకం నరేశ్, శ్రీనివాస్ ప్రోద్బలంతో రూ. 5 వేల విలువ చేసే బాలల కథలకు సంబంధించిన పుస్తకాలను అమెజాన్ ద్వారానే కొనుగోలు చేసి అందజేసినట్లు తెలిపారు. గ్రామ యువత దాతకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గణేశ్, లోక పురుషోత్తం, అంకం నరేశ్, గంగారెడ్డి, బాలాగౌడ్, సుధాకర్, రవీందర్, వినీత్, ఆకాశ్, అశోక్ పాల్గొన్నారు

వచ్చే 20న జిల్లా స్థాయి డ్యాన్స్ పోటీలు

మాట్లాడుతున్న జిల్లా డ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

సుభాష్‌నగర్, జూలై 7 : జిల్లా డ్యాన్స్ అసోసియేషన్ వార్షిక సమావేశాన్ని అసోసియేషన్ అధ్యక్షుడు ఆనంద్‌బాబు ఆధ్వర్యంలో అంజలి సిస్టర్స్ డ్యాన్స్ అకాడమీ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనంద్‌బాబు మాట్లాడుతూ.. వచ్చే నెల 20న జిల్లాస్థాయి డ్యాన్స్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జానపద, శాస్త్రీయ, వెస్టర్న్ డ్యాన్స్ సంబంధిత కళలకు సంబంధించి అసోసియేషన్ ప్రతినిధులందరి సహకారంతో పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి తోట ప్రశాంత్, కోశాధికారి నవనీత, మద్దుకూరి సాయిబాబు, మృణాళిని, గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నవీపేట, జూలై 7: అటవీ ప్రాంతంలో చిరుతపులి సంచరిస్తున్నందున మోకన్‌పల్లి, కమలాపూర్ గ్రామాలతోపాటు చుట్ట పక్కల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నిజామాబాద్ ఫారెస్టు రెంజ్ ఆఫీసర్ పద్మారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు రోజుల క్రితం మోకన్‌పల్లి, కమలాపూర్ గ్రామాల సరిహద్దులోని గుట్ట ప్రాంతంలో మేకల మందపై చిరుతపులి దాడి చేసి ఓ మేకను గాయపర్చిందని గుర్తు చేశారు. బీట్ ఆఫీసర్లు మోకన్‌పల్లి ఘటన స్థలానికి వెళ్లి చిరుత పులి ఆనవాళ్ల కోసం ఆదివారం పరిశీలించారని తెలిపారు.

డాక్యుమెంటేషన్ చార్జీలు తగ్గించాలి

శక్కర్‌నగర్, జూలై 7: పెంచిన డాక్యుమెంటేషన్ చార్జీలు తగ్గించాలని కోరుతూ బోధన్ సబ్ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం సమర్పించినట్లు బోధన్ రియల్ ఎస్టేట్ ఏజెంట్ల సంఘం అధ్యోక్షుడు టి.చంద్ర శేఖర్ (చందు), కార్యదర్శి అబ్దుల్ మోహిద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 1వ తేదీ నుంచి డాక్యుమెంట్ చార్జీలను విపరీతంగా పెంచారని, గతంలో రూ. 1800 తీసుకునే వారని, ప్రస్తుతం రూ.2500 తీసుకుంటున్నారని వెల్లడించారు. చార్జీలు తగ్గించే వరకు తాము ఈనెల 8 నుంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఏసీపీ, ఆర్డీవోలకు వినతిపత్రాలు సమర్పించామని వివరించారు.

యోగా కేంద్రం వార్షికోత్సవం

దాదన్నగారి విఠల్‌రావును సన్మానిస్తున్న యోగా కేంద్రం నిర్వాహకులు, నాయకులు

ఖలీల్‌వాడి, జూలై 7 : నగరంలోని సాయినగర్‌లో ఆదివారం మహర్షి యోగా కేంద్రం 17వ వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావుతోపాటు లింగేశ్వర గుట్ట ఆశ్రమాధిపతి పిట్ల కృష్ణ మహరాజ్ పాల్గొన్నారు. యోగా కేంద్రం వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రభాకర్ మాట్లాడుతూ.. సంపూర్ణ ఆరోగ్యం కోసం యోగా చేయాలన్నారు. పిట్ల కృష్ణ మహరాజ్‌తో పాటు తన పదవీ కాలం ముగిసిన సందర్భంగా దాదన్నగారి విఠల్‌రావును బీసీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు వినోద్, ప్రభాకర్ సన్మానించారు.

విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

- తల్లీ బిడ్డలను కాపాడిన అగ్నిమాపక శాఖ సిబ్బంది

మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది, పిల్లలను బయటికి తీసుకువస్తున్న సిబ్బంది

వినాయక్‌నగర్, జూలై 7 : నగరంలోని పూలాంగ్ ఏరియాలో శనివారం రాత్రి ఓ ఇంట్లో విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం సంభవించింది. స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నర్సింగ్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని టీటీడీ కల్యాణ మండపం ఎదురుగా ఉన్న హనుమాన్‌నగర్ కాలనీ ప్రధానరోడ్డుపై ఉన్న వనమాన కృష్ణ ఇంటిని అద్దెకు ఇచ్చారు. రాత్రి సమయంలో ఆ బిల్డింగ్‌లో షార్ట్‌సర్క్యూట్‌తో విద్యుత్‌మీటర్‌లో మంటలు చెలరేగి గదిలోకి వ్యాపించాయి. స్థానికులు అగ్నిమాపక శాఖకు సమాచారం అందించడంతో సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. అప్పటికే ఇంట్లోని కొన్ని వస్తువులు దగ్ధమయ్యాయి. అదేసమయంలో ఆ భవనంలోని మొదటి అంతస్తులోకి దట్టమైన పొగలు వ్యాప్తించాయి. ఆ గదిలో తల్లి తన ఇద్దరు చిన్నారులతో కలిసి నిద్రిస్తున్నట్లు గుర్తించి వారిని సురక్షితంగా బయటికి తీసుకువచ్చారు. దీంతో చుట్టుపక్కల వారు ఊపిరి పీల్చుకున్నారు. స్థానికుల సహాయంతో తల్లీబిడ్డలను కాపాడిన ఫైర్ సిబ్బందిని స్థానికులు అభినందించారు.

మాజీ ప్రజాప్రతినిధులకు సన్మానం

వేల్పూర్/చందూర్, జూలై 7: ఇటీవల పదవీ విరమణ పొందిన ఉపసర్పంచ్ పిట్ల సత్యం, ఎంపీటీసీ మొండి మహేశ్‌ను మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘం, సావర్కర్ యూత్ ఆధ్వర్యంలో సన్మానించారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి సహకారంతో వేల్పూర్ గ్రామంతోపాటు వేల్పూర్ ముదిరాజ్ సంఘం అభివృద్ధికి తోడ్పాడ్డారని కొనియాడారు. కార్యక్రమంలో రవి, శ్రీనివాస్, కృష్ణ, గంగన్న, ప్రసాద్, సంతోష్, దత్తు, రవి, మారుతి, కార్తీక్, వెంకటేశ్, ప్రశాంత్, రాజేశ్, వెంకటేశ్, యూత్ సభ్యులు పాల్గొన్నారు. చందూర్ జడ్పీటీసీ సభ్యుడు అంబర్‌సింగ్‌ను ఆయన స్వగృహంలో వర్ని మండలానికి చెందిన పలువురు యూత్ నాయకులు ఆదివారం ఘనంగా సన్మానించారు. తన పదవీకాలం ముగియడంతో సన్మానించామని తెలిపారు. ఐదేండ్ల పాటు అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పిరాజీ నాయక్, కృష్ణారెడ్డి, నేమాని రఘు, చందా వినోద్, నిఖిల్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

ఐదు పశువులు చోరీ

నవీపేట, జూలై 7: మండల కేంద్రంలో మూడు రోజుల నుంచి వరుసగా పశువుల దొంగతనాలు జరుగుతున్నాయి. మూడు రోజుల క్రితం నవీపేటకు చెందిన ఎర్రోల్ల గంగాధర్ కొన్నేండ్లుగా నందిపేట్ వెళ్లే దారిలో తన పొలం వద్ద పశువుల కొట్టంలో పశువులను కట్టివేస్తున్నాడు. మూడు రోజుల క్రితం పశువుల కొట్టం నుంచి మూడు ఆవులను గుర్తు తెలియని వ్యక్తులు తీసుకొని వెళ్లారు. శనివారం రాత్రి నవీపేటకు చెందిన దశరథ్, మహేందర్ రెండు ఎద్దులను ఇంటి వద్ద కట్టివేయగా దొంగిలించుకొని పోయారు. చుట్టు పక్కల వెతికినా ఫలితం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఎస్సై యాదగిరిగౌడ్‌దృష్టికి తీసుకెళ్లగా పశువుల దొంగలను పట్టుకునేందుకు సిబ్బందితో గాలింపు చర్యలు చేపడుతామని పేర్కొన్నారు. దొంగ తనానికి గురైన పశువుల విలువ రూ. 3 లక్షల వరకు ఉంటుందని బాధితులు పేర్కొన్నారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

ధర్పల్లి, జూలై 7 : మండల కేంద్రంలోని అరుంధతి ఫంక్షన్ హాలులో నేడు (సోమవారం) ఉదయం 11 గంటలకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ కిరణ్మయి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి హాజరుకానున్నారని, లబ్ధిదారులు సకాలంలో కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

కార్యవర్గం ఎన్నిక

శక్కర్‌నగర్, జూలై 7: బోధన్‌లోని సయ్యద్ షా జలాల్ బుకారీ దర్గా ఉర్సు ఉత్సవ కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం గౌరవ అధ్యక్షుడిగా ముషీర్‌బాబాను, అధ్యక్షుడిగా ఖాజీ షర్ఫుద్దీన్, కార్యదర్శిగా యూనుస్ పటేల్, కోశాధికారిగా మహ్మద్ ముక్రం అహ్మద్‌తోపాటు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మరో రెండు మూడు నెలల్లో ఉత్సవాలు నిర్వహించనున్నట్లు సంఘ నాయకులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో బోనాల పండుగ

బోధన్‌లో పూసల సంఘం ఆధ్వర్యంలో బోనాలు..

బోధన్ మండలం ఖండ్‌గామ్ గ్రామంలో ..

ముల్లంగి(బీ)లో బీరప్ప ఆలయం వద్ద పూజలు చేస్తున్న గొల్ల, కురుమ కులస్తులు

బోధన్/బోధన్ రూరల్/మోర్తాడ్/ముప్కాల్/మాక్లూర్/ఆర్మూర్‌టౌన్/ఇందల్వాయి/సుభాష్‌నగర్, జూలై 7: బోధన్ పట్టణంలో ఆదివారం పూసల సంఘం ఆధ్వర్యంలో బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహాలక్ష్మీ మందిరంలో నైవేద్యాలు సమర్పించారు. వర్షాలు కురవాలని, పాడిపంటలు బాగుండాలని కోరారు. బోధన్ మండలంలోని ఖండ్‌గామ్ గ్రామంలో గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో బోనాల పండుగ నిర్వహించారు. కమ్మర్‌పల్లి, మోర్తాడ్ మండలాల్లోని అన్ని గ్రామాల్లో కులసంఘాల ఆధ్వర్యంలో గ్రామదేవతలకు పూజలు నిర్వహించి, కుటుంబ సమేతంగా వనభోజనాలకు వెళ్లారు. ముప్కాల్ మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామ దేవతలకు గంగనీళ్లతో జలాభిషేకం నిర్వహించారు. మాక్లూర్ మండలంలోని ముల్లంగి(బీ), మాక్లూర్, మాదాపూర్ తదితర గ్రామాల్లో ప్రజలు గ్రామదేవతలకు మొక్కులు చెల్లించుకుని వనభోజనాలకు వెళ్లారు. ముల్లంగి(బి)లో గొల్ల, కురుమ కులస్తులు బీరప్ప దేవుడికి మొక్కులు చెల్లించుకుని మేకలు బలిచ్చారు. ఆర్మూర్ పట్టణంలోని నల్ల పోచమ్మ, పెద్దమ్మ తల్లి, ముత్యాలమ్మ, మహాలక్ష్మీ ఆలయాల్లో భక్తులు అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. కుటుంబ సభ్యులతో కలిసి వనభోజనాలకు వెళ్లారు. ఇందల్వాయి మండలంలోని అన్సాన్‌పల్లి, నల్లవెల్లి, ఎల్లారెడ్డిపల్లి, తిర్మన్‌పల్లిలోని గ్రామదేవతలకు ప్రజలు జలాభిషేకం చేసి పూజలు చేశారు. అనంతరం వనభోజనాలకు తరలివెళ్లారు. ఆషాఢమాసంలో మొదటి ఆదివారం సందర్భంగా వినాయక్‌నగర్‌లోని మహాలక్ష్మీ ఆలయంలో పద్మశాలీ 46వ తర్వ ఆధ్వర్యంలో పూజలు చేశారు. అనంతరం పదోతరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.1000 చొప్పున అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో తర్వ సంఘం అధ్యక్షుడు కొండ గంగాచరణ్, కార్యదర్శి క్యాతం గంగాధర్, కోశాధికారి చాట్ల రవీందర్ సభ్యులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

- **నిధులు మంజూరు చేయండి** - ఆర్మూర్‌టౌన్, జూలై7: మంత్రి సీతక్కను హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ నాయకుడు వినయ్ రెడ్డి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజక వర్గంలోని గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు.
- **డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లకు 160 దరఖాస్తులు**- రెంజల్, జూలై 7: కందకుర్తి గ్రామంలో డబుల్‌బెడ్‌రూం ఇండ్ల కోసం 160 మంది దరఖాస్తు చేసుకున్నట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి సతీశ్‌చంద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 50 డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల కోసం ఈనెల 4 నుండి 6 వరకు దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. దరఖాస్తులను తహసీల్దార్ విచారణ చేపట్టి లబ్ధిదారులను ఎంపిక చేస్తారని తెలిపారు.
- **నీటి ట్యాంకులను శుభ్రపరచాలి**- ఏర్గట్ల, జూలై 7: మండలంలోని అన్ని గ్రామాల్లో వాటర్ ట్యాంకులను శుభ్ర పరిచేలా గ్రామ పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఎంపీవో శివచరణ్ ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. ప్రతి రోజూ క్లోరినేషన్ చేయాలని, ఇండ్ల యజమానులు పరిసరలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.
- **పెద్దమ్మ ఆలయంలో చోరీ**- ఆర్మూర్‌టౌన్, జూలై7: పట్టణ శివారులోని పెద్దమ్మ తల్లి ఆలయంలో ఆదివారం చోరీ జరిగిందని ముదిరాజ్ కుల సంఘ పెద్దలు తెలిపారు. దొంగలు అమ్మవారి వెండి, బంగారం నగలు చోరీ చేశారన్నారు. తరుచూ దొంగతనాలు జరుగుతున్నాయని, పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. పోలీసులు నిఘా ఉంచాలని కోరారు.
- **మొక్కలు నాటి సంరక్షించాలి**- జక్రాన్‌పల్లి, జూలై 7 : ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని బ్రాహ్మణ్‌పల్లి గ్రామ ప్రత్యేకాధికారి బ్రహ్మానందం అన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా గ్రామంలో మహిళలకు ఆదివారం మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హరీశ్, ఫీల్డ్ అసిస్టెంట్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



నగరంలోని శ్రీనూతన వైశ్య ఉన్నత పాఠశాల (మాణిక్‌భవన్)లో సమావేశమైన 1996-97 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు



బోధన్‌లో వంశీ హైస్కూల్ 2000-2001 బ్యాచ్ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

బోధన్/బాల్కొండ, జూలై 7: బోధన్ పట్టణంలోని వంశీ హైస్కూల్ 2000-2001 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. వివిధ వృత్తులు, వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన ఈ పూర్వ విద్యార్థులంతా 23 ఏండ్ల తర్వాత ఒకే వేదికపై కలుసుకున్నారు. ఒకరికొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వంశీ హైస్కూల్ కరస్పాండెంట్ విజయకుమార్ – పద్మజ దంపతులతోపా నాటి గురువులు రామాంజనేయులు, శివ శ్రీనివాస్, జాస్తి శ్రీనివాస్, రామ్‌ప్రసాద్, వీరేశం, గంగారాం, మల్లిక్, నర్సింగ్‌రావు, వెంకటరమణను సన్మానించారు. గురువు రామ్‌ప్రసాద్‌కు వారంతా కలిసి రూ.లక్షా వేయి ఆర్థిక సహాయాన్ని అందించారు. బాల్కొండ జడ్పీ ఉన్నత పాఠశాల 1997-98 టెన్త్ బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం మండల కేంద్రంలో నిర్వహించారు. పూర్వ ఉపాధ్యాయులను సన్మానించారు. నగరంలోని శ్రీనూతన వైశ్య ఉన్నత పాఠశాల (మాణిక్‌భవన్)లో 1996-97 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు 27ఏండ్ల తర్వాత ఒక్కచోట కలిశారు. పా